క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు ఖాకీచొక్కాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి చేయూతతో ఆటోడ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలువురు డ్రైవర్లకు పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, కాంగ్రెస్ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ ఖాకీ చొక్కాలు అందజేసి మాట్లాడారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ చొక్కాలను ఎంపీ సమకూర్చారని తెలిపారు. కార్పొరేటర్ దొడ్డా నగేష్, నాయకులు సీహెచ్.విప్లవ్ కుమార్, ఉమ్మినేని కృష్ణ, పరికిపల్లి శ్రీను, జంగిపల్లి ప్రసాద్, సిద్ధల నగేష్, తోట సైదులు, కె.మధు, ఎ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ కలెక్టర్‌కు సన్మానం



ముజమ్మిల్‌ఖాన్‌ను సత్కరిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: కలెక్టర్‌గా ఏడాది పాటు విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీ అయిన ముజమ్మిల్‌ఖాన్‌ను మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సన్మానించారు. ఈమేరకు దయాకర్‌రెడ్డి కలెక్టర్ చేసిన సేవలను కొనియాడారు.

గిరిజన గ్రామాల్లో సర్వే



సుద్దవాగుతండాలో సర్వే చేస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తి ఆబాజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్అభియాన్ పథకంపై మంగళవారం మండల అధికారులు సర్వే నిర్వహించారు. 700లకు పైగా ఉన్న గిరిజన తెగల కలలు సాధికారిత కోసం జిల్లాలో ఆరు మండలాలు ఎంపిక కాగా.. అందులో మండలంలోని సుద్దవాగుతండా, సోలిపురం, లక్ష్మీదేవిపల్లి, హైదరసాయిపేట గిరిజన గ్రామాలు ఎంపికయ్యాయి. ఈ మేరకు సుద్దవాగుతండాలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఖలీల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు సర్వే నిర్వహించి అందరికీ ఆధార్‌కార్డులు, ఆయుష్మాన్, ఆరోగ్యశ్రీ, కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయో లేదోనని తెలుసుకుని విద్యుత్ సౌకర్యం తదితర అంశాలపై ఆరా తీశారు.

అనాథశవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం త్రీటౌన్ ఏరియాలో మంగళవారం భిక్షాటన చేస్తూ 70 ఏళ్ల కురువృద్ధుడు మృతిచెందాడు. దీంతో విషయాన్ని స్థానికులు బాలు చారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ చెరుకుపల్లి బాలుకు సమాచారం అందించగా.. ట్రస్ట్ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రకాష్‌నగర్ వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సీహెచ్.ప్రవళిక, పి.వేణు, కె.సైదులు, సీతారాములు, కె.కాశయ్య, పడిశాల వీరస్వామి, గట్టికొండ చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు

కామేపల్లి: మండలంలోని మర్రిగూడెంలో శ్రీ అభయాంజనేయస్వామి, ముత్యాలమ్మతల్లి, బొడ్రాయికి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. మంగళవారం డీఎన్‌సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ దిరిశాల నరేశ్‌చౌదరి–స్వాతి దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

గంజాయి విక్రయానికి వెళ్తున్న ముగ్గురి అరెస్ట్

కూసుమంచి: గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మండలంలోని నర్సింహులగూడెంకు చెందిన దేగల గోవర్ధన్, పోలుదాసు రవి, పోలుదాసు భద్రయ్య నంబర్ లేని బైక్‌పై వెళ్తూ మంగళవారం రాత్రి నానుతండా వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు తారసపడ్డారు. ఈక్రమాన పారిపోయే ప్రయత్నం చేయగా వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో గంజాయి విక్రయించేందుకు వెళుతున్నట్లు ఒప్పుకున్నారు. వీరి నుంచి 100 గ్రాముల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకుని ముగ్గురిపైనే కాక వీరికి గంజాయి అమ్మిన ఒడిశా రాష్ట్రానికి చెందినరమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ఇంకా మందకొడిగానే..



అండర్ డ్రెయిన్ పైపులు వేసినా పారని మురుగు నీరు

నిధులు మంజూరైన పూర్తికాని డ్రెయిన్, కాల్వ నిర్మాణ పనులు

- అభివృద్ధి పనుల పేరుతో రోడ్లు ధ్వంసం
- వానాకాలం సమీపించినా వీడని నిర్లక్ష్యం
- మురుగు నిలిచి కంపుకొడుతున్న కాల్వలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పైపులైన్ పేరుతో సీసీ రోడ్డు తవ్వకం..

ఖమ్మంఅర్బన్: నగరాభివృద్ధి పేరుతో నగరంలో చేపట్టిన అండర్ డ్రెయిన్ నిర్మాణ పనులు, వాటి అనుబంధంగా మురుగు కాల్వల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రూ.240 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టగా.. మురుగు సమస్య తీరుతుందని భావించిన ప్రజలకు ఈ ఏడాది కష్టాలు తప్పేలా లేవు. ఖానాపురం అలుగువాగు చుట్టూ అండర్ డ్రెయిన్ నిర్మాణం, దానికి అనుబంధంగా మురుగు నీరు పారేందుకు వేసే పైపులైన్ పనులు గత కొన్ని మాసాలుగా కొనసాగుతున్నప్పటికీ ఎక్కడా పూర్తిస్థాయిలో అయినట్లుగా లేదు. ఇప్పటికీ మురుగు వాసన, కాల్వల్లో ఎక్కడిక్కడే నిలిచిన మురుగునీరు, వాగుల్లోకి చేరుతున్న మలినాలతో కంపుకొడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని ఖానాపురం అలువు వాగు, లకారం ట్యాంక్ బండ చుట్టూ, చెరువు పరిసర ప్రాంతాల్లో వాగుల చుట్టూ మురుగు వాసన భరించలేనంతంగా మారింది.

నర(డ)కయాతన..

గతేడాది భారీ వర్షాల కారణంగా వాగులు పొంగి లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరి భారీ నష్టం మిగిల్చింది. ఇప్పుడు ఈ ప్రాంతాల ప్రజలు మురుగు సమస్యలతో నర(డ)కయాతన పడుతున్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి పేరుతో రోడ్లు గుల్ల చేయడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచి కనీసం నడిచే పరిస్థితి లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు మురుగు, అప్పుడు ముంపు బాధలు తప్పడంలేదని వాపోతున్నారు. అండర్ డ్రెయిన్ పేరుతో ఎక్కడెక్కడో మురుగు నీరు తీసుకొచ్చి వాగులో వదలడంతో ఆ నీరు ముందుకు సాగే పరిస్థితి లేక నిల్వ నీటితో మురుగు కంపుకొడుతున్నట్లు నివాసులు చెబుతున్నారు. అండర్ డ్రెయిన్ కోసం అంటూ ఇటీవల కాలంలో వేసిన సీసీ రోడ్లను అడ్డదిడ్డంగా తవ్వకాలు చేసి వదిలేయడంతో వచ్చిపోయే వాహనలతో బురదమయంగా మారాయి. ఈ వానాకాలం పనులు పూర్తికాకుంటే రాకపోకలు కూడా కష్టంగా మారే అవకాశం ఉంది. ఇకనైనా పనులు త్వరగా పూర్తిచేసి ఈ బాధల నుంచి తమను విముక్తి కల్పించాలని నివాసులు కోరుతున్నారు.

తక్షణ చర్యల కోసం..

వర్షాకాలం దగ్గరపడుతుండగా ఇదే తరహాలో మురుగు నిలిచిపోతే మళ్లీ ముంపు పరిస్థితి తలెత్తే అవకాశముంది. కనీసం ఇప్పుడు పనులను వేగవంతం చేసి మురుగు నీరు వాగుల్లోకి వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు. వాగుల్లో సైతం నీటి నిల్వలు ఉండకుండా సాఫీగా ముందుకు సాగేలా తగు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

గతంలోనే నయం..



చైతన్యనగర్ పరిసరాల్లో వాగులో నీటి నిల్వలు పేరుకుపోయాయి. అండర్ డ్రెయిన్ పైపులైన్ పనులు పూర్తి కాకపోవడంతో కాలనీల్లో నీరు వాగు వద్ద పోటేసి నిలిచిపోవడంతో వాసన భరించలేకపోతున్నాం. గతంలోనే నయం. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– పుచ్చకాయల వెంకటేశ్వర్లు, నివాసి

డ్రెయిన్ పేరుతో తవ్వకాలు



మురుగు తరలింపు పేరుతో ఉన్న సీసీరోడ్డును గుల్ల చేశారు. దీంతో ఏ చిన్న చినుకు పడిగా బురదమయంగా మారుతోంది. కాంట్రాక్టర్లు ఎక్కడిక్కడే పనులు వదిలేయడంతో తామే మిషన్ ద్వారా రోడ్డు సరి చేయించుకున్నాం. తమ బాధలను గమనించి తగిన చర్యలు తీసుకోవాలి.

– నీరుకొండ శేషసాయిబాబా, నివాసి

ఆరోగ్య సమస్యలు..



ఖానాపురం అలుగు వాగులో ఎక్కడిక్కడే నిలిచిన మురుగు నీరు

అండర్‌డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో వాగుల వద్ద, ప్రధాన రహదారుల వెంట మురుగునీరు పేరుకుపోతోంది. కొన్నిచోట్ల రహదారుల పక్కనే మురుగు నిలిచి దోమలు స్వైర విహారం చేస్తుండగా.. దుర్వాసనతో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అంతేకాక నిధులు విడుదలైనప్పటికీ పనుల పురోగతి మందగమనం ప్రజల్లో ఆగ్రహం కలిగిస్తోంది. పనుల్లో సమన్వయం లేకపోవడంతో ఆలస్యానికి కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రమేష్

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని పాలేరు స్పెషల్ ఆఫీసర్ రమేష్ అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం సీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ రికార్డులను, ఆపరేషన్ థియేటర్ తదితరాలనుపరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలు, కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకోగా ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేయాలని ఆయన దృష్టికి తెచ్చారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఓపీ సేవలు వేర్వేరుగా ఉండాలని, వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బాలాజీనగర్‌తండాలో ఇందిరమ్మ ఇళ్లను స్పెషల్ ఆఫీసర్ రమేష్ పరిశీలించి ప్రభుత్వం ప్రభుత్వం ప్రతిపాదించిన కొలతల ప్రకారమే నిర్మాణాలు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి వినతి



డీఆర్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దొడ్డిదారిన తెస్తున్న రైతాంగ వ్యతిరేక చట్టాలను, చర్యలను తెలంగాణలో అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుని రైతాంగ సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి ఆవుల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం ఐక్య రైతు సంఘం జిల్లా ప్రతినిధి బృందం ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ పద్మశ్రీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన మార్కెటింగ్ చట్టం రైతు వ్యతిరేకమని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఘటించాలని డిమాండ్ చేశారు. అలాగే పత్తి కొనుగోళ్లపై ధర వ్యత్యాశ చెల్లింపు పథకాన్ని అమలు చేయొద్దని కోరారు. సీసీఐ ద్వారా కనీస మద్దతు ధర ప్రకటించి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బీరెల్లి లాజర్, సహాయ కార్యదర్శి ఒగ్గు నాగిరెడ్డి, కోశాధికారి కేలోతు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా విడుదలపై హర్షాతిరేకాలు



ఖమ్మంఅర్బన్: పాలాభిషేకం చేస్తున్న నాయకులు, కార్పొరేటర్లు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయం అందజేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు ఖమ్మంలో కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు పాలాభిషేకం చేశారు. మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారాల నరేష్ మోహన్ నాయుడు, బొమ్మ ఉదయ్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ యరగర్ల హనుమంత రావు, తల్లాడ రమేష్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మిక్కిలినేని నరేంద్ర చౌదరి, అఫ్రీష్, లతీఫ్‌లతో పాటు బాణాల లక్ష్మణ్, పాల్వంచ కృష్ణ, వెన్న పండు, కాంపటి వెంకన్న, ఫజల్, స్వరూప రాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మం సంజీవరెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్క శేఖర్ రైతు భరోసా విడుదలపై హర్షం వ్యక్తం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొంటేముక్కల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోజేడ్ల సత్యమయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొర్నీ సీతారాములు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



చెరువుమాధారం వైద్యశాలలో సూచనలు చేస్తున్న రామారావు

నేలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అసంక్రమిత వ్యాధుల జిల్లా పోగ్రామ్ అధికారి డాక్టర్ రామారావు సూచించారు. మండలంలోని చెరువుమాధారం, నేలకొండపల్లి వైద్యశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించాక మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, వీరన్న, చంద్రశేఖర్, విజయకుమారి, రోహిణి, భవాని ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కాగా, సీజనల్ వ్యాధులపై అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు, నివారణ చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ వినతిపత్రం అందించారు.

కేఎంసీ సమాచారం..

● పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం



కార్మికులకు మందులు అందిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: వంద రోజుల ప్రణాళిక కార్యాచరణలో భాగంగా కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికుల కోసం 25వ డివిజన్‌లో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించి మాట్లాడారు. నగర పరిశుభ్రతతో పాటు కార్మికుల ఆరోగ్యాన్ని సంరక్షించడం కోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని డివిజన్లలో పనులు నిర్వహిస్తున్నందున కార్మికులకు అవసరమైన సామగ్రిని అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోళ్ల వెంకట్, డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, శానిటేషన్ సూపర్‌వైజర్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

● సామూహిక అక్షరాభ్యాసం..

నగరంలోని 26వ డివిజన్ ముస్తఫానగర్ సెక్టర్ పరిధిలో గల సుగ్గులవారి తోటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మేయర్ నీరజ సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పలకలు, బలపాలు అందించిన ఆమెమాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో చిన్నారులకు పోషకాలతో పాటు విద్యాబుద్ధులు నేర్పేందుకు ప్రభుత్వం సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ చిత్తూరు విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డెబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పడకేసిన పల్లె దవాఖానా!



మండలంలోని కామంచికల్ గ్రామంలో పల్లె దవాఖానా గత కొద్ది రోజులుగా తెరుచుకోవడం లేదు. ఇక్కడ పనిచేసే వైద్యాధికారి, సిబ్బంది కనీసం సమయపాలన పాటించకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారు తమ ఇష్టానుసారంగా విధులకు హాజరవుతుండడంతో ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో దవాఖానాకు వస్తే సిబ్బంది లేక నిరాశతో వెనుదిరగడం పారిపాటిగా మారింది. అసలే వర్షాకాలం ఆపై సీజనల్ వ్యాధులతో పాటు ఇతరత్రా అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున ఇలా వైద్యులు లేకపోతే ఎలా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

– ఖమ్మంరూరల్

సంక్షిప్తంగా..

➡ కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం భూభారతి కార్యక్రమం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కారం చేస్తుందని వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బాసిత్‌నగర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, తోటకూరి శివయ్య, దేవండ్ల రామకృష్ణ, వరికొల్లు సైదులు, రమేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

➡ 22న గొర్రెల పెంపకందారుల సమావేశం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా స్థాయి గొర్రెల పెంపకందారుల సమావేశాన్ని ఈనెల 22(ఆదివారం) నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య తెలిపారు. ఈమేరకు ఖమ్మంలో మంగళవారం సమావేశ కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశానికి కురుమ, యాదవులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కాగా, జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపులో కురుమ, యాదవులు కీలక పాత్ర పోషించినందున రాజకీయంగా, నామినేటెడ్ పోస్టుల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు చిత్తారి సింహాద్రి యాదవ్, లిక్కి కృష్ణారావు, మేకల నాగేశ్వరరావు, కనకబండి విజయలక్ష్మి, మల్లెబోయిన శ్రీనివాస్, గూడె భద్రయ్య, జొన్నబోయిన పాపయ్య, మారుతి గట్టయ్య, చేతుల నాగేశ్వరరావు, సోమనబోయిన లింగయ్య, మల్లెబోయిన ఉపేందర్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

➡ ఘనంగా 'ప్రియదర్శిని' ఫేర్‌వెల్ డే

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో మంగళవారం బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.నవీన్, డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ.. ఎప్పటికీ నిజాయతీ, క్రమశిక్షణ, కష్టపడేతత్వంతో ముందుకెళ్లాలని తెలిపారు. విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలు అలరించాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


➡ శరవేగంగా విద్యుత్ పనులు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండా గ్రామానికి ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చినప్పుడు స్థానికులు విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన మంత్రి విద్యుత్ శాఖాధికారులను ఆదేశించడంతో మంగళవారం అధికారులు గ్రామంలో కిందకు వేలాడుతున్న తీగలను పైకిలాగడం, ఒరిగిన స్తంభాలను సరి చేయడం, కొత్త స్తంభాలకు వైర్ లాగటం వంటి పనులను శరవేగంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సీత్యా, సొసైటీ డైరెక్టర్ కోటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ ధర్మా, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, విద్యుత్ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

➡ ప్రపంచ శాంతి నెలకొల్పాలని ప్రదర్శన

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచ శాంతి నెలకొల్పాలని ఆకాంక్షిస్తూ, గాజ, ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ నాయకుల ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖమర్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ.. శాంతియుతంగా ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యను పరిష్కరించుకునేందుకు ఐక్యరాజ్యసమితి వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మైనార్టీ అధ్యక్షుడు శంషొద్దీన్, మైనార్టీ నాయకులు సద్దాం షేక్, ఆసీఫ్, బురఖాన్, ఉద్యమకారులు దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, మోసిన్, ఇలియాస్, మున్నా, చోటు, చంటి, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

➡ పల్లెలను తీర్చిదిద్దిన మోదీ



నాయకులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కూసుమంచి: ప్రధాని మోదీ తన 11 ఏళ్ల పాలనలో దేశంలోని పల్లెలను తీర్చిదిద్దారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు ఆకుల నాగేశ్వరరావు అన్నారు. ఈమేరకు మంగళవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కూసుమంచిలో స్థానికులను కలిసి మోదీ పాలనపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీ నాయకత్వాన్ని ప్రజలు బలపర్చాలని, రానున్న రోజుల్లో విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమంలో భారత్ శక్తివంతమైన దేశంగా అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడ్డం వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖా సత్యనారాయణ, దాసరి దుర్గయ్య, గంజి ఉదయ్‌కుమార్, రావులపెంట ఉపేందర్, నాగిరెడ్డి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ తిరుమలాపురంలో గ్రామసభ

నేలకొండపల్లి: మండలంలోని తిరుమలాపురంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తండా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎంపీడీఓ ఎం.యర్రయ్య అడిగి తెలుసుకున్నాక.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలపై వివరించారు. ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేని వారికి అందించనున్నట్లు తెలిపారు. తాగునీటి సౌకర్యం, రేషన్‌కార్డుల దరఖాస్తులు, విద్యుత్ సౌకర్యాలపై గిరిజనులు అధికారులకు వివరించారు. ఈ సభలో ఎంపీఓ శివ, డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఎంఈఓ బి.చలపతిరావు, పీ.ఆర్.ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

➡ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని మంగళవారం పలువురు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు గొంగూర వెంకటేశ్వరరావు, కూరపాటి ప్రదీప్‌లు మాట్లాడుతూ.. సంపూర్ణఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగాలో పాల్గొన్నారు. సిద్ధార్థ యోగా మాస్టర్ కొదండరావు, ఆప్పారావు పాల్గొన్నారు.

➡ పెన్షనర్లకు కేంద్ర చట్టం ఆశనిపాతం



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య

ఖమ్మంసహకారనగర్: ఈ ఏడాది పార్లమెంట్ ఆమోదం పొందిన చట్టం పెన్షనర్ల పాలిట ఆశనిపాతంగా మారనున్నదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య అన్నారు. మంగళవారం కృషిభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌పీఎఫ్)పిలుపు మేరకు సంతకాలు సేకరించాలని పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, సహా అధ్యక్షులు భాస్కరాచారి, మేరి ఏసుపాదం, లక్ష్మీసుజాత, కృష్ణకుమారి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ వీరభద్రరావు, ప్రసాదరావు, శ్రీనివాసరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

➡ కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడులో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఆర్‌ఐ, గ్రామ కార్యదర్శితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు చెక్కులు మంజూరు కాగా లబ్ధిదారులు కొంగర జ్యోతి, నల్లమోతు రమాదేవిలకు గ్రామ మాజీ సర్పంచ్ బాతుల రమణసుధాకర్ అందించారు. కార్యక్రమంలో షేక్ ఆరీఫ్, బండి రమ, కొంగర చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

➡ విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ ప్రధాన విద్యుత్ లైన్‌లో సమస్య తలెత్తడంతో మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ లైన్ జంపర్లు తెగిపోవడంతో రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ రాకపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.